సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



నిజాంపేట్: ప్రజా సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పార్టీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డితో కలిసి కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ హాల్స్, బాచుపల్లిలోని కౌసల్య కాలనీలో ల్యాండ్ కబ్జా, గాజులరామారంలోని టీఎస్ఐఐసీ ల్యాండ్స్, దుండిగల్ మున్సిపాలిటీ, బహదూర్‌పల్లి, డి.పోచంపల్లి, కైసర్‌నగర్, నిజాంపేట్, బాచుపల్లి డబుల్‌బెడ్‌రూమ్స్‌లలో అంగన్‌వాడీ కేంద్రం, బస్తీ దవాఖాన తదితర సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుల సమావేశం

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు గండిమైసమ్మలోని జిల్లా కార్యాలయంలో జరుగనుంది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ హాజరుకానున్నారు. బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, మున్సిపల్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొనాలని నాయకులు కోరారు.

ఒడిస్సా ప్రజల ఆధ్వర్యంలో కావడియాత్ర



సుభాష్‌నగర్: ఒడిస్సా ప్రజలు శ్రావణమాసం సందర్భంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునేది కావడి యాత్ర. సోమవారం ఐడీపీఎల్ నుంచి సూరారంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయం వరకు పెద్ద సంఖ్యలో ఒరిస్సా ప్రజలు కాబడి యాత్ర నిర్వహించారు. భక్తులకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో కలిసి తాడు సహాయంతో కనుమ పద్ధతిలో యాత్ర సాగేలా కృషి చేశారు. 4 కిలోమీటర్ల మేర ఇతరులకు ఇబ్బంది కలగకుండా యాత్ర కొనసాగడంతో భక్తులు ట్రాఫిక్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నిజాంపేట్: మంచినీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం సీపీఎం బాచుపల్లి మండల కార్యదర్శి బి.వెంకటరమణ ప్రగతినగర్ వాటర్ వర్కర్స్ బోర్డు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రగతినగర్ ప్రాంతంలో ఐదు సంవత్సరాల నుంచి ప్రజానీకం విపరీతమైన మంచినీటి సమస్యతో బాధపడుతున్నారని, ఎన్నిసార్లు వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకొచ్చిన పరిష్కారం కాలేదన్నారు. మంచినీరు రాకపోయినా బిల్లు మాత్రం కరెక్టుగా ప్రతినెల వసూలు చేస్తూనే ఉన్నారన్నారు. అదే సమయంలో నీటి సరఫరా గురించి అడిగితే ట్యాంకర్ బుక్ చేసుకోండి.. అని అధికారులు సమాధానం చెప్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఈ వాటర్ సమస్యపై ప్రజలను చైతన్యం చేసి పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాల వెంకటేశ్వరరావు, వెంకటరాజ్యం, అక్బర్‌అలీ ఖాన్, బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. నిలిచిన విద్యుత్ సరఫరా

జగద్గిరిగుట్ట: సోమవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు డివిజన్‌లు, నిజాంపేట, దుండిగల్, కొంపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలోని పలు బస్తీలు, కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా

‘స్పెషల్ డ్రైవ్’

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు ముమ్మరం
- డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా తదితర వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది
- పనితీరును తనిఖీ చేస్తున్న ఉన్నతాధికారులు



ఎంటమాలజీ సిబ్బందితో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)

కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికులతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ ఎటువంటి అంటువ్యాధులు రాకుండా కట్టడి చేసేందుకు సిద్ధమయ్యారు. గ్రేటర్ కమిషనర్ ఆదేశాలతో గాజులరామారం సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కేసుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని వాటిని తగ్గించే దిశగా చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే 11 డెంగీ, రెండు చికెన్ గున్యా కేసులు వెలుగులోకి రావడంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్య అధికారులు ఆయా ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి దోమలు వృద్ధి చెందకుండా ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో వివిధ రసాయనాలను పిచికారీ చేశారు. సిబ్బంది పనితీరుపై ఇప్పటికే కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, ఉప కమిషనర్ మల్లారెడ్డి, వైద్య ఆరోగ్య అధికారి మమత ఆకస్మికంగా తనిఖీలు చేస్తూ సిబ్బందిని పరుగులు పెట్టిస్తున్నారు.



గాజులరామారంలో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, సర్కిల్ అధికారులు(ఫైల్)

ప్రతిరోజు ఒక్క డివిజన్‌ను ఎంచుకొని..

నెల రోజులుగా వైద్య ఆరోగ్య అధికారి మమత ఆధ్వర్యంలో ప్రతిరోజు ఒక డివిజన్ ఎంచుకుంటున్నారు. గ్యాంగ్ వర్క్ పేరిట సుమారు 300 మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బందిని ప్రధాన రోడ్డు మొదలుకొని గల్లీ రోడ్ల మొత్తం శుభ్రం చేయడం, నీరు నిలవకుండా కట్టడి చేయడం, మురుగునీరు రోడ్లపైకి చేరకుండా చర్యలు చేపడుతున్నారు. ఏఎల్‌ఓలు, పారిశుద్ధ్య సిబ్బంది తోపాటు టౌన్ ప్లానింగ్, హార్టికల్చర్ విభాగం అధికారులు సైతం పాల్గొంటున్నారు.

పరిధి పెరిగినా... సిబ్బంది సంఖ్య అంతే..

గాజులరామారం, జగద్గిరిగుట్ట, చింతల్, సూరారం డివిజన్ల పరిధిలో ఉన్న కాలనీలతో పాటు తాజాగా బాలాజీ లే అవుట్, సూరారం కాలనీ పరిసర ప్రాంతాల్లో ఉన్న బస్తీలు, కైసర్ నగర్ ప్రాంతాల్లో సైతం కొత్తగా పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. మొత్తం 420 మంది సిబ్బంది పని చేయాల్సి ఉండగా వయోభారం నిమిత్తం, ప్రతిరోజు ఆబ్సెంట్ అయ్యే సిబ్బందితో పాటు సుమారు 363 మంది మాత్రమే ఈ ప్రాంతంలో పనిచేస్తూ వస్తున్నారు. దీంతో కాలనీల పరిధి పెరుగుతున్నప్పటికీ సిబ్బంది సంఖ్య మాత్రం పెరగకపోవడం మూలంగా అంతంత మాత్రంగానే పారిశుద్ధ్య పనులు జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు సిబ్బందితో పని చేయించకుండా కాలయాపన చేస్తున్నట్లు తెలుస్తోంది.

డెంగీ, చికెన్ గున్యా కేసులపై దృష్టి

గాజులరామారం సర్కిల్ పరిధిలోని 4 డివిజన్లలో అత్యధిక మురికివాడ ప్రాంతాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో ఎక్కడైతే కేసులు వెలుగులోకి వస్తున్నాయో ఆ ప్రాంతంలో ప్రత్యేక దృష్టి సారించి దోమలు వృద్ధి చెందకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వ్యాధులు సోకిన వారికి వైద్య ఆరోగ్య అధికారులు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మెరుగైన వైద్యాన్ని అందించే దిశగా చర్యలు చేపట్టారు. దీంతో వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యాధికారి మమత పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికే ‘ప్రజావాణి’

- డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, నరసింహ
- ప్రజావాణిలో 24 ఫిర్యాదులు

కుత్బుల్లాపూర్: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమమని జంట సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్‌లు మల్లారెడ్డి, నరసింహ అన్నారు. జంట సర్కిళ్ల పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 24 ఫిర్యాదులు వచ్చాయి. గాజులరామారం సర్కిల్ ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన ఉదయం 10: 30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగిన కార్యక్రమంలో 14 ఫిర్యాదులు రాగా, వాటిలో ఇంజనీరింగ్ 10, టౌన్ ప్లానింగ్ రెండు, ఎలక్ట్రిసిటీ రెండు ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో పది ఫిర్యాదులు వచ్చాయి. సంబంధిత శాఖ అధికారులకు వారం రోజుల్లో సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు.

- శ్రీరామ్ నగర్ కాలనీ రోడ్డు నంబర్ 11, 12 లలో గతంలో రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైన ఇప్పటివరకు పనులు జరగలేదని, 30 సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్న జనం ఇబ్బందులు పడుతున్నారని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు ఫిర్యాదు చేస్తే పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు.. అయినప్పటికీ పనులు చేయకపోవడంపై అభ్యంతరం ఏమిటని సంక్షేమ సంఘం అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఆర్గనైజర్ బసవరాజు కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ దృష్టికి తీసుకువచ్చారు.
- ద్వారకానగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజుయాదవ్ ఉప కమిషనర్ నరసింహకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు, కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత్‌రెడ్డి ప్రతిపాదించిన లేఖను అందజేశారు. ప్రణాళికలు రూపొందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని కోరారు.

జలమండలి ప్రజావాణిలో ఆరు ఫిర్యాదులు

చింతల్: కుత్బుల్లాపూర్ జలమండలి కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో సూరారం కాలనీ, కృషి కాలనీ, పుష్పగిరి కాలనీ, సాయిబాబానగర్, పాండుబస్తీ, శివాహిల్స్ తదితర ప్రాంత ప్రజలతో కలిసి జీఎం మాధవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాలకు పదిరోజులకోసారి మంజీర నీటిని విడుదల చేయడంతో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారని, రెండు రోజులకోమారు నీటిని సరఫరా చేయాలని కోరారు. జలమండలి అధికారులు నీటి విడుదల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే స్థానికులతో కలిసి ఖైరతాబాద్‌లోని జలమండలి కేంద్ర కార్యాలయం ముందు ధర్నా చేపడతామని హెచ్చరించారు. ప్రజావాణిలో మొత్తం ఆరు ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని జీఎం పేర్కొన్నారు.

నిజాంపేట్: ప్రజావాణిలో కలెక్టర్ మను చౌదరిని సోమవారం బీఆర్‌ఎస్ ప్రగతినగర్ 6వ డివిజన్ అధ్యక్షుడు ఉప్పు జస్వంత్ కలిసి ప్రగతినగర్‌లోని శ్మశానవాటిక, అంబీర్ చెరువు ఆక్రమణలు, దోమల నివారణకు చర్యలపై ఫిర్యాదు చేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని తన బృందానికి తెలియజేశారని ఆయన తెలిపారు.



ఉప కమిషనర్ నరసింహకు ఫిర్యాదు చేస్తున్న సంక్షేమ సంఘం ప్రతినిధులు



జలమండలి జీఎంకు ఫిర్యాదు అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కొలన్ హన్మంత్‌రెడ్డి

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 31, 33 డివిజన్లలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టి, త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంసీ జనరల్ సెక్రటరీ కొలన్ జీవన్‌రెడ్డి, లక్ష్మణ్, పి.ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణ, పితాని శ్రీనివాసరావు, నరసింహారావు, రాంచందర్‌నాయక్, దాల్‌నాయుడు, ఆటో శ్రీను, గౌస్‌బాయ్, భుజంగరెడ్డి, రాయుడు, వెంకట్‌రెడ్డి, సరితారెడ్డి, రాధాజ్యోతి, ధనలక్ష్మి, నవ్య బేకరి, సత్యవతి, చిరంజీవి, ఈశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నిజాంపేట్ : సమసమాజమే లక్ష్యంగా ఆవిర్భవించిన అనేక త్యాగాల చరిత్ర కలిగిన సీపీఐ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం సీపీఐ నిజాంపేట్ వార్డు కార్యాలయం వద్ద మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మేడ్చల్ జిల్లా గాజులరామారంలో మహారాజా గార్డెన్‌లో ఘనంగా జరగనున్నాయని తెలిపారు. వందేళ్ల ప్రస్థానంలో ముందుకు సాగుతున్న సీపీఐని ప్రజలతో మరింత మమేకం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర మహాసభలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఆశీ యాదయ్య, దస్తగిరి, నర్సమ్మ, భాగ్యమ్మ, పుష్పమ్మ, యాదమ్మ, అమృతమ్మ, లక్ష్మిమ్మ, సైదులు, కృష్ణ, వెంకన్న, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి శ్రీ హోమ్స్ కాలనీలో సోమవారం అభయ ఆంజనేయ సహిత నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎన్ఎంసీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు రవి కిరణ్, పెదిరెడ్డి సుజాత, మేకల మధుసూదన్, సాంబశివారెడ్డి, దేవస్థానం ట్రస్టు చైర్మన్ ప్రదీప్, కమిటీ సభ్యులు సాంబశివరావు, విజయ్, ఆనంద్, కిరణకుమార్, వెంకటేశ్వరరావు, శేషి, సంతోష్, రామోజీరావు తదితరులు పాల్గొన్నారు.

నెట్‌వర్క్ సెక్యూరిటీస్‌తో డేటా సురక్షితం



సదస్సులో పాల్గొన్న వివిధ కళాశాలల అధ్యాపకులు

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీఎం కళాశాలలో సోమవారం టుడే ఎక్స్‌పర్ట్ టాక్ ఆన్ నెట్‌వర్క్ సెక్యూరిటీస్ వర్క్ షాప్ జరిగింది. యునైటెడ్ స్టేట్స్ టోలేడో యూనివర్సిటీలో సీఎస్ఈ ప్రొఫెసర్ అహ్మద్ జావేద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ఎక్స్‌పర్ట్ టాక్ ఆన్ నెట్‌వర్క్ సెక్యూరిటీస్ తమ సంస్థలు నెట్‌వర్క్ రక్షణలను బలోపేతం చేయడం ద్వారా చాలా లాభపడతాయన్నారు. జావెద్ మాట్లాడుతూ.. నెట్‌వర్క్ సెక్యూరిటీతో సైబర్ ప్రమాదం చాలా వరకు తగ్గిందని, బలమైన, దృఢమైన భద్రతా చర్యలతో డేటా ఎల్లప్పుడూ సురక్షితంగా ఉండేలా చూసుకోవడంలో సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్స్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ అబ్దుల్ బాసిత్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డుల మంజూరు పత్రాలు

నేడు మేడ్చల్‌లో పంపిణీ చేయనున్న ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి,మేడ్చల్ జిల్లా: కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు, మ్యూటేషన్ల (చేర్పులు, మార్పులు)కు సంబంధించిన లెటర్లు (మంజూరు పత్రాలు) సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు జిల్లా పౌర సరఫరాలశాఖ చర్యలు తీసుకుంటోంది. మంగళవారం మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని అత్వెల్లి, జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో కొత్త రేషన్ కార్డులు, మ్యూటేషన్లకు సంబంధించిన లెటర్లు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబు అందజేయనున్నారు.

దరఖాస్తుల పరంపర...

కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందుతూనే ఉన్నాయి. గత రెండు నెలల్లో వందల సంఖ్యలో దరఖాస్తులు రాగా.. వీటిల్లో 7,700 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. 20 వేల మంది సభ్యుల పేర్లను పాత కార్డుల్లో చేర్చారు. జిల్లాలో ఓ వైపు కార్డుల మంజూరు ప్రక్రియ కొనసాగుతుంటే... ఇంకోవైపు దరఖాస్తుల పరంపర కొనసాగుతోంది.

సెప్టెంబరులోనే పంపిణీ..

జూన్, జూలై నెలల్లో కొత్తగా రేషన్ కార్డులు అందిన వారికి, పేర్లు చేర్చిన లబ్ధ/ దారులకు సెప్టెంబరులో బియ్యం కోటా మంజూరు కానుంది. ఈ విషయం తెలియక చాలామంది లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో 3 నెలలకు సంబంధించిన కోటాను జూన్‌లోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ దుకాణం డీలర్లు సంబంధిత లబ్ధిదారులకు అందజేశారు.

జడ్పీహెచ్‌ఎస్‌ను పరిశీలించిన విద్యా కమిషన్ చైర్మన్



విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకుంటున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

కుత్బుల్లాపూర్: తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సోమవారం కొంపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలను పరిశీలించారు. ఆయనతో పాటు విద్యా కమిషన్ సభ్యురాలు కందాడి జ్యోత్స్నారెడ్డి, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీతో సమావేశమయ్యారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలతో పాఠశాల అభివృద్ధిపై చర్చించారు. అనంతరం పాఠశాల వంటగది, మూత్రశాలలను, ఇతర మౌలిక వసతులను పరిశీంచారు. విద్యార్థుల అభిప్రాయాలు సేకరించారు. పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

చెరువును తలపిస్తున్న రోడ్లు



నీటమునిగిన రోడ్డు

నిజాంపేట్ : కొద్దిపాటి వర్షానికే రోడ్లన్ని ఛిద్రమై, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపు నీటితో నిండుకుని చెరువులను తలపిస్తున్నాయి. ఆ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. ఎక్కడ ఏ గుంత ఉందో, ఏ డ్రైనేజీ ఉందో తెలియని పరిస్థితి. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లో పలు ప్రాంతాల్లో వర్షం కురిసిన ప్రతీసారి రోడ్లన్నీ వర్షంనీటితో, డ్రైనేజీ నీటితో నిండి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రగతినగర్‌లోని అనేక ప్రాంతాలలో వర్షం కురిసిన ప్రతీసారి రోడ్లు జలమయమవుతున్నాయి. వాసవి లేఅవుట్‌లో ప్రశాంతి గోల్డెన్ హిల్స్ నుంచి సిదిధ బ్లాక్ వెల్లే రోడ్డులో వరదనీరు చేరి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. పాదచారులు సైతం నడిచే పరిస్థితి ఉండదు. ప్రగతినగర్‌లోని ప్రధాన రోడ్డులో సైతం ఈ పరిస్థితి నెలకొని ఉంది. అదేవిధంగా ఆదిత్య గార్డెన్ కాలనీ సైతం వర్షం పడ్డ ప్రతీ సారి వరదనీటితో నిండిపోవాల్సిందే. ఇప్పటికైనా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

వర్షం.. స్తంభించిన జనజీవనం



గాజులరామారం చిత్తారమ్మ ఆలయం వద్ద..



జీడిమెట్ల పారిశ్రామికవాడ ఫేజ్-2లో..

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇబ్బందులు పడ్డ వాహనదారులు
- అధికారుల సహాయక చర్యలు

సుభాష్‌నగర్: రెండు రోజులుగా వేడితో కూడిన ఎండలు కొట్టడంతో వేసవి కాలాన్ని తలపించింది. ఉన్నట్టుండి సోమవారం సాయంత్రం ఒక్కసారిగా దట్టమైన మేఘాలు కమ్ముకొని కుత్బుల్లాపూర్‌లో రెండు గంటల పాటు భారీ వర్షం పడింది. దీంతో చింతల్, గాజులరామారం, సూరారం ప్రధాన రోడ్లు జలమయంగా మారాయి. చింతల్ ప్రధాన రోడ్డులో వర్షపు నీరు నిలువగా జీడిమెట్ల ట్రాఫిక్, హైడ్రా ఇతర సిబ్బందితో కలిసి వర్షపు నీరు వెళ్లేలా సహాయక చర్యలు చేపట్టారు. ప్రధాన రోడ్లపై భారీగా వరద ప్రవహించడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు.



చింతల్ ప్రధాన రోడ్డులో వరదనీటిని మళ్లిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది



గాజులరామారం ప్రధాన రోడ్డులో ప్రవహిస్తున్న వరదనీరు